క్లుప్తంగా

నేడు మండల మీట్

పాకాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అరుణ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఎంపీపీ లోకనాథం అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తామని, మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అన్ని అంశాలపై చర్చిస్తామని వివరించారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా హాజరవ్వాలని, అధికారులు తమ నివేదికలు సమర్పించాలని కోరారు.

ఉగ్రవాదుల దాడి దారుణం



నివాళులర్పిస్తున్న కార్పొరేటర్లు, అధికారులు

తిరుపతి తుడా: జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడులకు పాల్పడడం హేయమైన చర్య అని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు, అధికారులు, కార్పొరేటర్లు ఖండించారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి గురువారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద వారు నివాళులు అర్పించారు. నగరపాలక సంస్థ అధికారులు, కార్పొరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



నివాళులు అర్పిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

భాకరాపేట : చంద్రగిరి నియోజకవర్గం చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు ఇళ్లకు వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి గురువారం ఆత్మీయంగా పలకరించారు. ఆయన వెంట ఎంపీపీ యగంధర్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సహదేవరెడ్డి, చిన్నగొట్టిగల్లు మండల పార్టీ అధ్యక్షుడు సింహాల మోహన, ఎర్రావారిపాళెం జెడ్పీటీసీ కరుణాకర్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు చెంగల్‌రెడ్డి, మండల పార్టీ కమిటీ, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బాలాజీ జయంతి



అన్నదానం చేస్తున్న సర్పంచ్ రామచంద్రారెడ్డి

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం తిరుచానూరుకు చెందిన దివంగత యువనేత బాలాజీ 36వ జయంతి వేడుకలను స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. తిరుచానూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ రామచంద్రారెడ్డి చేతుల మీదుగా అన్నదానం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరు నెలల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలాజీ మృతి చెందాడని, వారి కుటుంబ సభ్యులకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు.

సమ్మర్ ఎఫెక్ట్

ఎస్వీయూ ఎఫ్ బ్లాక్ సమీపంలో కృష్ణ జింకల గుంపు హల్‌చల్ చేస్తున్నాయి. వేసవి వేడిమిని తట్టుకోలేక ఆహారం కోసం విద్యార్థులు సంచరిస్తున్న హాస్టళ్ల వద్దకు చేరుకుని చెత్తకుప్పలో పడేసిన ఆహారాన్ని, వ్యర్థాలను తింటున్నాయి. సుమారు ఐదు జింకలు ఎఫ్, ఈ బ్లాక్‌ల సమీపంలో రోడ్డు పక్కన ఉన్న చెత్త కుప్ప వద్ద సుమారు గంటకు పైగా ఆహారాన్ని వెతుకుతూ నిలబడిపోయాయి. రోడ్డుపై వాహనాలు, ప్రజలు వెళ్తున్నా బెదరకుండా ఆహారం కోసం వెతుకుతున్న జింకలను చూసిన విద్యార్థులు, ప్రజలు వేసవి ఉష్ణోగ్రతలకు అడవిలోని వృక్షాలు ఎండిపోవడంతో ఆహారం కోసం రోడ్డుపైకి వచ్చాయంటూ చర్చించుకున్నారు.

– తిరుపతి సిటీ



ఫ్రిడ్జ్ వద్దు.. మట్టి కుండ ముద్దు..



భానుడి ధాటికి ఉష్ణోగ్రతలు భగభగమంటున్నాయి. ఎండలో తిరిగి ఇంటికొచ్చాక చల్లని నీటి కోసం వెంపర్లాడతాం.. అయితే ఫ్రిడ్జ్‌లో పెట్టిన నీటి కంటే మట్టి కుండలో నీరే ఆరోగ్యానికి శ్రేయస్కరం. దీంతో కుండలకు గిరాకీ ఏర్పడింది. మట్టికుండల తయారీదారులు కూడా కుండలకు ట్యాప్ పెడుతున్నారు. ఇంటిలో ఫ్రిడ్జ్ ఉన్నా.. మట్టి కుండలో పోసిన నీరు తాగితే ఎంతో శ్రేష్టం. అందుకే చాలామంది ప్రజలు కుండలను కొనుగోలు చేస్తున్నారు తిరుపతి నగరంలోని తుడా సర్కిల్ సమీపంలో మట్టి కుండలను నగరవాసులు కొనుగోలు చేసి తీసుకెళ్తున్న దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్ అనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

పరీక్షా కాలం..

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైంది. పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించారు. దీంతో ఎస్వీయూలో డీఎస్సీ అభ్యర్థులు పుస్తకాలు పట్టుకుని నిమగ్నమయ్యారు. రాత్రి, పగలు తేడా లేకుండా వర్సిటీలో కుస్తీ పడుతున్నారు. చెట్ల నీడ కనిపిస్తే చాలు కూర్చుని పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. సాధారణంగా విద్యార్థులు పరీక్షల సమయాల్లో, ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదలప్పుడు ప్రతి రోజూ వర్సిటీ లైబ్రరీ సమీప ప్రాంతంలో చెట్ల నీడన కూర్చుని పుస్తక పఠనం సాగిస్తారు. కానీ డీఎస్సీ పరీక్షలకు కేవలం 40 రోజులు మాత్రమే ఉండడంతో నోటిఫికేషన్ విడుదలైన రోజు నుంచి తిండితిప్పలు పక్కన పెట్టి ప్రిపరేషన్ సాగిస్తున్నారు.

– తిరుపతి సిటీ



గోకులం షెడ్లు అధికార పార్టీ వాళ్లకేనా ?

- నిజమైన పాడి రైతులకు ఇవ్వరా ?
- మండల మీట్‌లో సభ్యుల ప్రశ్నల వర్షం



మాట్లాడుతున్న ఎంపీపీ రెడ్డెమ్మ

భాకరాపేట : ప్రభుత్వం మంజూరు చేస్తున్న గోకులం షెడ్లు కేవలం అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలకేనా అంటూ ఎర్రావారిపాళెం మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు. గురువారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రెడ్డెమ్మ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు కరుణాకర్‌రెడ్డి, ఉస్తికాయలపెంట సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ గోకులం షెడ్లను పశువులు లేకపోయినా టీడీపీ కార్యకర్తలకు ఇస్తున్నారని ఉపాధి హామీ పథకం అధికారులను నిలదీశారు. ఉస్తికాయలపెంట రెవెన్యూ గ్రామ లెక్క దాఖలా 191 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమి పంచాయతీలో ప్రభుత్వ అవసరాలకు, భవనాల నిర్మాణానికి ఉపయోగపడుతుందని..కానీ ప్రభుత్వ భూమిని కొందరు యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం దారుణం అని ప్రశ్నించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఆక్రమించినా, నిర్మాణాలు చేపట్టినా కూలదోస్తామని సభ్యులకు హామీ ఇచ్చారు. సమావేశానికి హాజరు కాని పలు శాఖల అధికారులపై జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్తామని ఎంపీపీ రెడ్డెమ్మ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణ, తహసీల్దార్ రామస్వామి, వైస్ ఎంపీపీ నాగేశ్వరరావు, ఎంపీటీసీలు, సర్పంచులు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువకుడిపై మద్యం దుకాణదారుల దాడి



గాయపడిన నాగరాజు

చంద్రగిరి: యువకుడిపై మద్యం దుకాణదారులు బీరు బాటిల్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన చంద్రగిరి సమీపంలోని ఇందిరమ్మకాలనీ వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. రాయలపురం గ్రామానికి చెందిన కత్తి నాగరాజ ఇందిరమ్మ కాలనీ సమీపంలోని సారీ వైన్స్ వద్దకు చేరుకున్నాడు. దుకాణం వద్ద పెద్ద ఎత్తున మందుబాబులు ఉండడంతో నాగరాజ లైన్లో వేచి ఉన్నాడు. ఈ క్రమంలో దుకాణం పక్కనే ఉన్న కూల్‌డ్రింక్ దుకాణానికి చెందిన సాయి అనే వ్యక్తి మద్యం దుకాణంలోకి వెళ్తుండగా నాగరాజ ఆక్షేపించాడు. తామంతా లైన్లో వేచి ఉంటే నువ్వెలా లోపలికి వెళ్తావ్ అంటూ సాయిని ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అదే గ్రామానికి చెందిన చెంగయ్య కలుగజేసుకుని ఇద్దరికీ నచ్చజెప్పి పంపించేశాడు. అనంతరం మద్యం దుకాణంలో పనిచేస్తున్న మోహన్‌యాదవ్ అనే వ్యక్తి చెంగయ్య వద్దకు వెళ్లి యువకుడిని దుర్భాషలాడుతూ అతని అచూకీ అడిగాడు. దళిత యువకుడు అని చూడకుండా చెంగయ్యను బెదిరించినట్లు బంధువులు తెలిపారు. ఈ క్రమంలో మరోసారి ఘటనా స్థలానికి చేరుకున్న కత్తి నాగరాజపై సాయితో పాటు మోహన్‌యాదవ్ దాడికి పాల్పడ్డారు. మోహన్ యాదవ్ బీరు బాటిల్ తీసుకుని నాగరాజ తలపై బాదాడు. నాగరాజ తలకు తీవ్ర రక్తగాయమైంది. స్థానికులు హుటాహుటిన చంద్రగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. గురువారం మధ్యాహ్నం కూడా సాయి అనే వ్యక్తి మద్యం దుకాణం వద్ద మరో యువకుడిని ఇలాగే చావబాదినట్లు స్థానికులు చెబుతున్నారు. రంగంలోకి దిగిన పోలీసులు మద్యం దుకాణాదారులకు మద్దతుగా మాట్లాడంపై గ్రామస్తులు మండిపడ్డారు. తిరుపతి రూరల్ మండలానికి చెందిన టీడీపీ నాయకుడికి చెందిన దుకాణం కావడంతో పోలీసులు వారికే వత్తాసు పలుకుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, కేసును విచారిస్తున్నాడు.

బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలి



రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కమిషనర్ అమరయ్య

తిరుపతి తుడా: తిరుపతి నియోజకవర్గ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఓటరు నమోదు అధికారి, ఇన్‌చార్జ్ కమిషనర్ అమరయ్య పిలుపునిచ్చారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాల మేరకు గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రజల నుంచి వచ్చిన అన్ని దరఖాస్తులను పరిశీలించాలని, వాటి వివరాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే చేసి నివాసాలు మారిన వివరాలు సేకరించి ఫారం–8 అప్‌లై చేశామని, ఇంకా ఏవైనా పెండింగ్‌లో ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రతినిధులను కోరారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఇళ్ల క్రమబద్ధీకరణ

తిరుపతి అర్బన్: తమ అధీనంలో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణ నేపథ్యంలో అందరికీ అవగాహన కల్పించాలని అర్బన్ తహసీల్దార్ కేపీ భాగ్యలక్ష్మి వెల్లడించారు. గురువారం ఆమె వీఆర్వోలతో పాటు సర్వేయర్లతో తమ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన జీఓ 30 ప్రకారం 2019 అక్టోబర్ 15కి ముందు తమ అధీనంలో ఉన్నవాటిని మాత్రమే క్రమబద్ధీకరణ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. తిరుపతి అర్బన్ పరిధిలో ప్రధానంగా రాజీవ్‌నగర్, ఎస్ఎస్ పురం, జీవకోన, సత్యనారాయణపురం, మంగళం, అయ్యప్ప కాలనీల్లో క్రమబద్ధీకరణ చేయాల్సిన ఇళ్లు ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించారు. ఆ మేరకు వీఆర్వోలు, సర్వేయర్లను ఐదు బృందాలుగా విభజన చేసిన ఇంటింటికి వెళ్లి అందరికీ అవగాహన కల్పించడంతోపాటు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారని స్పష్టం చేశారు. జీఓ నంబర్ 30 నిబంధనల గురించి వారికి వివరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రతోపాటు ఆర్ఐలు, వీఆర్వోలు, సర్వేయర్లు ఉన్నారు.

ఎన్ఎంఆర్‌లను పర్మినెంట్ చేయాలి

తిరుపతి కల్చరల్: టీటీడీలో ఎన్ఎంఆర్‌లుగా పని చేస్తున్న కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా డిక్లర్ చేసి, జీఓ వెంటనే విడుదల చేయాలని కేంద్ర మాజీమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ చింతామోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు కాంగ్రెస్ నేతలతో కలిసి ఆయన గురువారం టీటీడీ పరిపాలన భవనం ఎదుట ధర్నా నిర్వహించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని గురువారం సుప్రభాత సేవలో సినీనటి మీనాక్షి చౌదరి, ప్రభుత్వ విప్ జీవీ ఆంజనేయులు, సీనియర్ ఐఏఎస్ అధికారిణి రోహిణి సింధూరి దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

మహిళలకు కిశోర వికాసంపై వర్క్‌షాపు



మాట్లాడుతున్న స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారులు

తిరుపతి సిటీ: తిరుపతి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు రీజనల్ లెవల్ కిశోర వికాసంపై వర్క్‌షాప్ నిర్వహించారు. గురువారం అగ్రికల్చరల్ కళాశాల ట్రైనింగ్ సెంటర్లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్రస్థాయి జాయింట్ డైరెక్టర్ ఎం.శిరీష హాజరయ్యారు. ఆమె మట్లాడుతూ కిశోర బాలికల సమగ్ర అభివృద్ధికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం అసిస్టెంట్ డైరెక్టర్ నాగశైలజ మాట్లాడుతూ కిశోర వికాసం స్పెషల్ క్యాంపెయిన్ ఏప్రిల్ 25 నుంచి జూన్ 10వ తారీఖు వరకు పటిష్టంగా నిర్వహించాలని తెలిపారు. కిశోర బాలికలకు క్యాలెండర్ రూపొందించి గ్రామస్థాయి వరకు అందరికీ తెలియజేసేలా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి వసంతబాయి, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

సతీష్ రెడ్డికి అభినందనలు



సతీష్‌రెడ్డిని సత్కరిస్తున్న వైవీ రామిరెడ్డి

తిరుపతి సిటీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక సలహాదారుగా క్యాబినెట్ ర్యాంకుతో నియమితులైన డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, కేంద్ర రక్షణశాఖ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ గుండ్రా సతీష్ రెడ్డికి ఏబీఆర్ఎస్ఎం నాయకులు అభినందనలు తెలిపారు. ఈ మేరకు గురువారం మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘం (ఏబీఆర్ఎస్ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ తరపున రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. దేశ రక్షణ రంగంలో దాదాపు 35 ఏళ్ల పాటు సేవలు అందించారన్నారు. ఆయన అపార అనుభవం ఏపీలో పారిశ్రామిక రంగం పురోగతికి దోహదపడుతుందని ఆకాంక్షించారు.

ఎన్ఎస్‌యూలో ఔషధ వనం ప్రారంభం



ఔషధవనాన్ని ప్రారంభిస్తున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలోని హెల్త్ సెంటర్ ప్రాంగణంలో ఔషధ వనాన్ని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ వనంలో సుమారు 70 రకాల ఔషధ మొక్కలు నాటినట్టు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఔషధ మొక్కలు నాటుతామని వెల్లడించారు. ఔషధ వనం అభివృద్ధికి కృషి చేస్తున్న ఆయుర్వేదిక్ కన్సల్టెంట్ డాక్టర్ చిరంజీవి, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలదత్తాత్రేయ, డాక్టర్ శ్వేత, హెల్త్ సెంటర్ బృందాన్ని ఆయన అభినందించారు.

రక్తదాన శిబిరం

ఆరోగ్య సంరక్షణ చర్యల్లో భాగంగా జాతీయ సంస్కృత వర్సిటీలో హెల్త్ సెంటర్‌లో రుయా సిబ్బంది సహకారంతో గురువారం రక్త దాన శిబిరం నిర్వహించారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. 50 మంది విద్యార్థులు, ఉద్యోగులు రక్తదానం చేశారు. వారిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఫైనాన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ రాధాగోవింద త్రిపాఠి, డీన్ దక్షిణామూర్తి శర్మ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలదత్తాత్రేయ పాల్గొన్నారు.

ప్రమాదంలో స్కూటరిస్ట్ మృతి

పాకాల: కోళ్ల లోడ్డుతో ఉన్న బొలేరో వాహనం ఎదురుగా వస్తున్న స్కూటర్‌ను ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గురువారం స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారి, మండల పరిధిలోని దామలచెరువు సల్లాపురమ్మ ఆలయానికి సమీపంలో చిత్తూరు నుంచి మదనపల్లికి స్కూటర్‌పై వెళుతున్న చరణ్‌కుమార్(20)ను బొలేరో వాహనం ఢీకొంది. ఈ ఘటనలో చరణ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈస్ట్ సీఐగా శ్రీనివాసులు

తిరుపతి క్రైం: తిరుపతి ఈస్ట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ)గా శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రామకృష్ణ సోషల్ మీడియా వింగ్‌కు బదిలీ అవడంతో వీఆర్‌లో ఉన్న శ్రీనివాసులు ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

11న మాలల ఆత్మీయ గౌరవ సభ

తిరుపతి కల్చరల్: మాలల ఐక్యత, ఆత్మరక్షణే లక్ష్యంగా మే 11వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు మంగళం రోడ్డులోని ఆశా కన్వెన్షన్ హాల్లో నిర్వహించే మాలల ఆత్మీయ గౌరవ సభకు జిల్లాలోని మాల మేధావులు, ఉద్యోగులు, మాలలంతా పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని రాయలసీమ మాల సంఘాల జేఏసీ నేతలు అశోక్‌రత్నం, మల్లారపు మధు పిలుపునిచ్చారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మేధావులు ఈ సభకు హాజరు కానున్నారని తెలిపారు. మాల సంఘాల జేఏసీ నేతలు పాల్గొన్నారు.

వృక్షజాతి పెంపునకే 'వనరుచి'

తిరుపతి మంగళం : నగరవనంలో 'వన రుచి' ఫలహారశాల నిర్మాణంపై ఆందోళనలు వ్యక్తమయ్యాయని తిరుపతి వైల్డ్‌లైఫ్ డీఎఫ్ఓ వివేక్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రాంతంలో పూర్తిగా పర్యావరణ అనుకూల క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇది పూర్తిగా ప్లాస్టిక్ లేకుండా సౌరశక్తితో పనిచేస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్టులో స్థానికేతర మొక్కలను, అరుదైన ఔషధ మొక్కల జాతులతో పాటు స్థానిక జీవవైవిధ్యాన్ని, విలువైన వృక్షజాలాన్ని సంరక్షించడం వంటి వ్యూహాత్మక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు.

టెన్త్ ఫలితాల్లో కార్పొరేట్ స్కూళ్ల హవా



వి.నిహారిక, కె.మోక్షప్రియారెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్: బైరాగిపట్టెడలోని శ్రీపద్మావతి హైస్కూల్ విద్యార్థులు టెన్త్ ఫలితాల్లో వి.నిహారిక 584, కె.మోక్షప్రియారెడ్డి 583 మార్కులు సాధించారు. వీరిని ఆ పాఠశాల కరస్పాండెంట్ అభినందించారు.

హోలీగ్రీన్ స్కూల్‌లో..



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో హోలీగ్రీన్ పాఠశాల డైరెక్టర్లు

నగరంలోని హోలీగ్రీన్ పాఠశాల విద్యార్థులు టెన్త్ ఫలితాల్లో ఎస్.సమత 595, పి.చేతన్ 592, ఎం.జాహ్నవి 591 మార్కులు సాధించారు. పరీక్షకు హాజరైన తమ విద్యార్థులంతా వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల డైరెక్టర్లు వేణుగోపాల్‌రెడ్డి, హరినాథరెడ్డి తెలిపారు.

ప్రతిభా విద్యాలయ స్కూల్‌లో..



ప్రతిభ చాటిన ప్రతిభా విద్యాలయ విద్యార్థులు

భవానీనగర్‌లోని ప్రతిభా విద్యాలయ విద్యార్థులు ఎం.విష్ణుప్రియ 581, వై.నిహాంత్ 577, ఎస్.రెడ్డి గాయత్రి 576మార్కులు సాధించారు. వీరితో పాటు తమ విద్యార్థులంతా 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బొమ్మి మిల్టన్ తెలిపారు.

చైతన్యభారతి స్కూల్‌లో..



విద్యార్థులను అభినందిస్తున్న చైతన్యభారతి కరస్పాండెంట్

టెన్త్ ఫలితాల్లో హథీరాంజీ కాలనీలోని చైతన్య భారతి పాఠశాల విద్యార్థులు ఎస్.హేమలత 587, ఎస్.మనోజ్ 582, టి.చందన 579 మార్కులు సాధించారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ కె.జనార్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సురేంద్రనాథ్, ఇన్‌చార్జ్ వెంకటరమణ అభినందించారు.

ప్రతిభ చాటిన స్నేహిత



అంపాళ్లెం స్నేహిత

తిరుపతి కల్చరల్: రెడ్ చెర్రీస్ స్కూల్ విద్యార్థి అంపాళ్లెం స్నేహిత పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ చూపి 580 మార్కులు సాధించింది. పెద్దఅంజమేడు గ్రామానికి చెందిన ఈ విద్యార్థి ఉత్తమ మార్కులు సాధించడంతో ఆమెను పాఠశాల యాజమాన్యంతో పాటు పలువురు అభినందించారు.

విద్వాస్ విజయదుందుభి



అత్యుత్తమ మార్కులు సాధించిన గాయత్రి, దేవర్ష్, ప్రజీత్

తిరుపతి రూరల్: రూరల్ మండలం కాలూరు వద్ద ఉన్న విద్వాస్ స్కూల్ విద్యార్థులు టెన్త్‌లో గాయత్రి 600 మార్కులకు 595 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో నిలిచింది. అలాగే దేవర్ష్ 594 మార్కులు, ప్రజీత్ 590 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. 580కి పైగా మార్కులు సాధించిన వారిలో 8 మంది ఉన్నారు. వీరిని హెచ్ఎం అనురాధ అభినందించారు.